క్లుప్తంగా

ముక్కంటి సేవలో..



ఆలయం వద్ద విద్యానారాయణతీర్థస్వామి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం బెంగళూరు శ్రీజగద్గురు శంకరాచార్య సంస్థానం ద్వారకా బదరీకాశ్రమ పీఠాధిపతి విద్యానారాయణతీర్థస్వామి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు పీఠాధిపతికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వరదయ్యపాళెం: మండలంలో చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బత్తలవల్లం, మత్తేరిమిట్ట సచివాలయాల్లో స్థానిక మహిళలకు మంగళవారం స్విమ్స్ అధ్వర్యంలో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ కోసం మమ్మోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలను నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు సైతం చేశారు. కార్యక్రమంలో చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనిత, స్విమ్స్ వైద్యులు పద్మావతి, చైతన్యభాను, స్థానిక సర్పంచులు సింధుజ (మత్తేరిమిట్ట), లోకేశ్వరి (బత్తవల్లం), పంచాయతీ కార్యదర్శులు పద్మనాభరాజు, ఇందిర, ఎంఎల్‌హెచ్‌పీలు రిబ్కా, నిఖిల, ఏఎన్‌ఎంలు ఝాన్సీరాణి, కవిత పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్



ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి భారతి కోరారు. మంగళవారం ఆమె మండలంలోని కనమనంబేడు, పెద్దపాలేడు, చిన్నపాలేడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, ఈ-క్రాప్ బుకింగ్ వలన పంట రుణాలు, అనుకోని ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు నష్టపోతే పరిహారం పొందవచ్చని, అలాగే మద్దతు ధరపై పంటల కొనుగోలు చేయడం వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు. ఈ-క్రాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట: పరిసర ప్రాంతాల్లో ఇలా.., శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పోలీసులు, నారాయణవనం: శ్మశాన వాటిక సమీపంలో మద్యం సీసాలు తొలగిస్తున్న దృశ్యం







పోలీసులకిదో సామాజిక సేవ!

'తాగండి..ఊగండి..ఆదాయం పెంచండి' అనే లెవెల్లో ప్రభుత్వం మద్యం విక్రయాలకు అన్ని దారులూ తెరవడంతో మందుబాబులు అండ పిండ బ్రహ్మాండంగా మందుసేవనంలో తరిస్తున్నారు! కాస్త మరుగు స్థలం కనిపిస్తే చాలు అక్కడ మందుబాబులు వాలిపోయి ఎంచక్కా 'చీర్స్ గురూ' అంటూ బాటిళ్లతో తెగ ఖుషీ అయిపోతున్నారు. ఫలితంగా పోలీసులు తలలు పట్టుకుని రంగప్రవేశం చేయాల్సి వస్తోంది. మందుబాబుల భరతం పట్టేమాటెలా ఉన్నా మందుబాబులు గలీజు చేసిన ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో పడ్డారు. మద్యం ఖాళీ బాటిళ్లను సేకరించి దహనం చేస్తున్నారు! ఇక్కడ మద్యం సేవించరాదు అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): పోలీసుల దృష్టి ఇప్పుడు మందుబాబుల మద్యం సేవిత నిర్జన ప్రాంతాలపై ఫోకస్ పెట్టారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం రేణిగుంట అర్బన్ సీఐ శరత్ చంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పంచాయతీ సిబ్బంది సహాయంతో రేణిగుంట పరిసర ప్రాంతాలలో ఎక్కువగా మద్యం తాగే ప్రదేశాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మందుబాబులు తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను పోగు చేసి వాటిని కాల్చివేశారు. ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రి సమీపంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం నిషేధం అని పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పరిసరాలను పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, బాటిళ్లను, ఇతర వ్యర్థాలకు పడవేస్తే చర్యలు తప్పవని, కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం నారాయణవనంలో బహిరంగ ప్రదేశాల్లో, బావుల వద్ద, భారీ చెట్ల మరుగున ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు, మద్యం సీసాలను, పగిలిన మద్యం బాటిళ్ల పెంకులను పోలీసులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు తొలగించి శుభ్రం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలకు పూనుకున్నట్టు చెప్పారు. పోలీసుల సేవలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

జాగ్రత్తలు వహిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్



ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి: డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు వహిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. డ్రైవర్లు, కండక్టర్లు, విద్యార్థులకు అవగాహన డీఎస్పీ కల్పించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. పట్టణ 1వ, 2వ, రూరల్ సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 44మంది ఎంపిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీడీఓ ఎస్. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సుజాత అధ్యక్షతన నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్డీఏ, సిడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. వీల్స్ ఇండియా ప్రతినిధి ఆకాష్, బ్లూస్టార్ హెచ్‌ఆర్‌లు మోనిష, రాజశేఖర్, యూరిన్ ఆగ్రో హెచ్‌ఆర్‌లు సీహెచ్ మధు, వై నాగూరయ్య, ముత్తూట్ ఫైనాన్స్ గ్రూపు ప్రతినిధులు జానకిరాం, రాజశేఖర్ హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 44 మందిని ఎంపిక చేశారు. అనంతరం ఎంపీడీఓ పై విధంగా మాట్లాడారు. సత్యవేడులోని శ్రీసిటీలో పారిశ్రామీకరణ వేగవంతంగా జరుగుతుండడంతో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, యువత ఉద్యోగాలలో చేరి నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీసిటీ ఎస్టీఓ మురళీకృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల కో-ఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి, ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపల్ శామ్యూల్ అరవింద్, ప్లేస్‌మెంట్ అధికారి హన్నా తదితరులు పాల్గొన్నారు.

మరో మద్యం షాపు మంజూరు

నారాయణవనం: మండలానికి మరో మద్యం షాపు మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ తెలిపారు. దీంతో షాపుల సంఖ్య నాలుగుకు పెరిగింది. కల్లుగీత కార్మికుల కోసం ఏర్పాటు చేస్తున్న షాపునకు ఈడిగ కులస్తులు తిరిగి పొందలేని రూ 2 లక్షల ధరావత్తుతో ఫిబ్రవరి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాధ్యతగా డ్రైవింగ్ చేయండి : ప్రైవేటు స్కూళ్ల బస్సు డ్రైవర్లతో అర్బన్ సీఐ



మాట్లాడుతున్న సీఐ శరత్ చంద్ర

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లు, క్లీనర్లకు అర్బన్ సీఐ శరత్ చంద్ర రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్లో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, డ్రైవర్లు, క్లీనర్లతో అర్బన్ సీఐ, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు స్కూల్ బస్సులను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంచుకోవాలన్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని బాధ్యతతో డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం డ్రైవర్లు తమ సమస్యలను సీఐ దృష్టికి తీసుకువెళ్లారు.

పరిహారం..పరిహాసం



నిరసన తెలుపుతున్న రైతు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట విమానాశ్రయం రన్‌వే కోసం తమ నుంచి 2012లో ప్రభుత్వం తీసుకున్న 62 సెంట్ల భూమికి ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని నిరసిస్తూ బాధిత రైతు ఆర్.వెంకటసుబ్బారెడ్డి అక్కడ పనులను అడ్డుకున్నారు. వివరాలు.. రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 140/1ఊ లో వంశపారం పర్యంగా సంక్రమించిన 2 ఎకరాల డీకేటీ భూమిని ఆర్ వెంకట సుబ్బారెడ్డి సాగు చేస్తున్నారు. 2012లో 63 సెంట్లు, 2015లో 72 సెంట్లు, 2024లో 11 సెంట్ల భూమిని తిరుపతి విమానాశ్రయం అభివృద్ధికిగాను ప్రభుత్వం సేకరించింది. అయితే నష్టపరిహారాన్ని ఇప్పటివరకు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో, ఆ భూమిలో విమానాశ్రయ సిబ్బంది పనులు చేయడానికి మంగళవారం వెళ్లారు. పరిపరిహారం చెల్లించనిదే తమ భూమిలోకి వెళ్లనిచ్చేది లేదని ఆయన అడ్డుకున్నారు.

పశు వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నస్వామిపల్లెలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 120 పశువులకు పిడుదుల నివారణ మందు స్ప్రే చేశారు. 85 దూడలు, 350 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ తాపించారు. 16 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేశారు. రేణిగుంట పశు వైద్యులు డాక్టర్ సునీత, ఆర్.మల్లవరం డాక్టర్ స్రవంతి, వీణ, ఏహెచ్ఏ జల్ల మునిక్రిష్ణ, నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



వీరరాఘవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం: స్థానిక కనకవల్లి, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి కనుల పండుగగా నిర్వహించారు. వీరరాఘవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైంది. నాలుగు రోజుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. రాత్రి భక్తజన సందడి నడుమ వేదపండితులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పట్టుశాలి దంపతులు, మహిళలు హాజరై ప్రసాదాలు స్వీకరించారు. బుధవారం సాయంత్రం ఊంజల్‌సేవ, అనంతరం రాత్రి గరుడ వాహనంపై వీరరాఘవస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, వీధులను విద్యుత్ దీపాలు, దేవతా మూర్తుల ప్రతిమలతో సుందరంగా అలంకరించారు.